



జేసీకి వినాయకస్వామి చిత్రపటాన్ని అందిస్తున్న డీఆర్వో తదితరులు

జేసీగా విద్యాధరి బాధ్యతల స్వీకరణ

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 28: చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టరుగా విద్యాధరి బుధవారం ఉదయం తన చాంబరులో బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. అంతకుముందు కలెక్టరేట్‌కు చేరుకున్న ఆమెకు డీఆర్వో పుల్లయ్య పుష్పగుచ్ఛం అందజేశారు. జేసీగా బాధ్యతలు స్వీకరించాక డీఆర్వో పుల్లయ్య, కలెక్టరేట్ ఏవో కులశేఖర్ ఆమెకు కాణిపాక వరసిద్ధివినాయకస్వామి జ్ఞాపికను బహూకరించారు. కాణిపాక దేవస్థాన వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం రెవెన్యూ సర్వీసెస్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, వీఆర్వో సంఘం ప్రతినిధులు, ఎల్డీఎం హరీష్, సాంఘిక సంక్షేమశాఖ డీడీ రాజ్యలక్ష్మి, మెప్మా పీడీ రాధమ్మ, పలువురు తహసీల్దార్లు, జిల్లా అధికారులు కలిసి పుష్పగుచ్ఛాలు బహూకరించారు. కలెక్టర్ సుమిత్ కుమార్‌ను జేసీ మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



గుడ్ మార్నింగ్.. చిత్తూరు

నగరంలో ఇక ఎఫ్ఎం రేడియో

చిత్తూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గుడ్ మార్నింగ్ హైదరాబాద్.., గుడ్ మార్నింగ్ బెంగుళూరు.. అంటూ మహానగరాల్లో ట్రెండ్ సెట్ చేస్తూ.. ప్రజలను ఎంటర్‌టైన్ చేస్తున్న ఎఫ్ఎం రేడియో ఇక చిత్తూరులోనూ ప్రారంభం కానుంది. 'గుడ్ మార్నింగ్ చిత్తూరు..' అంటూ నగర ప్రజలను పలకరించనుంది. దేశవ్యాప్తంగా 234 నగరాల్లో కొత్తగా ఎఫ్ఎం రేడియోను ప్రారంభించడానికి బుధవారం కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. అందులో చిత్తూరుకూ స్థానం దక్కింది. స్థానిక అంశాలకు ప్రాధాన్యమిస్తూ మాతృభాషలో నడిపేలా రూ.784.87 కోట్లతో అంచనాతో ఈ ప్రైవేటు ఎఫ్ఎంలను ప్రారంభించనున్నారు. 234 నగరాల్లో 730 ఛానెళ్లను నిర్వహించనుండగా.. చిత్తూరు కేంద్రంగా పనిచేసే స్టేషన్‌లో మూడు ఛానెళ్లు ఉంటాయి. ఈ నిర్ణయంతో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశాలున్నాయి. స్థానిక అంశాలు, భాష, సంస్కృతి మీద అవగాహన ఉన్నవారికి, గాయకులకు మంచి అవకాశాలు లభించనున్నాయి.


మ్యూచువల్ అయితేనే బదిలీకి ఆమోదం

- ముగ్గురు కలెక్టర్ల నిర్ణయం
- రేపు సచివాలయ ఉద్యోగులకు కౌన్సెలింగ్

చిత్తూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు జరుగుతున్న విషయం తెలిసిందే. చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి తిరుపతి జిల్లాకు వెళ్లేందుకు ఎక్కువ మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై ఓ నిర్ణయం తీసుకునేందుకు చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు సుమిత్‌కుమార్, వెంకటేశ్వర్, శ్రీధర్ బుధవారం వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించుకున్నారు. చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి తిరుపతికి వెళ్లేందుకు ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరికి అనుమతిస్తే ఈ రెండు జిల్లాలు ఖాళీ అయిపోతాయని కలెక్టర్లు సుమిత్‌కుమార్, శ్రీధర్ అభిప్రాయపడ్డారు. మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ అయితే తప్ప, రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్‌కు అనుమతి ఇవ్వకూడదని నిర్ణయం తీసుకున్నారు. ఈ లెక్కన తిరుపతి నుంచి చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు వచ్చేవాళ్లు లేకపోవడంతో బదిలీలు ఎక్కువ స్థాయిలో జరగకపోవచ్చు.ఇప్పటికే కుప్పం నియోజకవర్గంలోని ప్రతి శాఖలోనూ ఉద్యోగుల ఖాళీలు అధికంగా ఉన్నాయి. సీఎం నియోజకవర్గంలో ఖాళీల్ని భర్తీ చేయాల్సిన అవసరముంది.ఈ నేపథ్యంలో చిత్తూరు జిల్లా నుంచి ఉద్యోగుల్ని మ్యూచువల్ లేకుండా రిలీవ్ చేసే అవకాశాలు లేవు.

1740 మంది సచివాలయ ఉద్యోగుల దరఖాస్తు

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు శుక్రవారం కౌన్సెలింగ్ జరగనుంది. మూడు జిల్లాల పరిధిలో ఇప్పటికి మొత్తం 1740 దరఖాస్తులు అందాయి. ఇందులో మ్యూచువల్ కోసం 183, మెడికల్ గ్రౌండ్స్ కింద 114 దరఖాస్తులున్నాయి. మిగిలినవన్నీ రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్సే ఉన్నాయి. ఇక్కడ కూడా మ్యూచువల్ బదిలీలకే ప్రాధాన్యమిస్తున్నారు. సింగిల్ పేరెంట్, స్పౌస్, డిసేబుల్డ్ పేరెంట్స్, చిల్డ్రన్స్ వంటి సమస్యలున్నవారికి మానవతా దృక్పథంతో బదిలీ చేసే అవకాశాలు ఉన్నాయి. అది కూడా అందరికీ కాకుండా అర్హులను గుర్తించి ప్రాధాన్యమిచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మున్సిపాలిటీలోని వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియను అనంతపురంలోని ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. కానీ, ఓ జిల్లా ఉద్యోగుల్ని మరో జిల్లాకు బదిలీ చేయాలంటే తొలుత ఆయా మున్సిపల్ కమిషనర్ల నో డ్యూ సర్టికెట్ సంపాదించాలి. ఆ తర్వాత కలెక్టర్లు అర్హతల్ని పరిశీలించి రిలీవ్ చేయాల్సి ఉంటుంది.



సిఫార్సు లేఖలు పనిచేస్తాయా?

- అనుకూల స్థానాల్లో పోస్టింగులకు ఉద్యోగుల పాట్లు
- మరో రెండు రోజుల్లో పూర్తికానున్న బదిలీలు

సిఫార్సు లేఖలు పనిచేస్తాయా? అనుకూల ప్రాంతాల్లో పోస్టింగులు వస్తాయా? ఎంపీ, ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలతో బదిలీలకు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగుల మధ్య సాగుతున్న చర్చ ఇది. గత నెలలో తహసీల్దార్ల బదిలీల కోసం ఎమ్మెల్యేలు లేఖలు ఇచ్చినా.. చాలావరకు పని జరగకపోవడాన్ని వారు గుర్తుచేసుకుంటున్నారు.

మరోవైపు మ్యూచువల్ ఉంటేనే బదిలీలకు ఆమోదించాలని కలెక్టర్లు నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో తమకు ఎవరైనా మ్యూచువల్ వస్తారా అని మరికొందరు ఉద్యోగులు ఆరా తీసే పనిలో పడ్డారు. - చిత్తూరు రూరల్

వివిధ శాఖల్లో బదిలీల ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. ఈ నెల 31వ తేదీకంతా బదిలీల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. సెప్టెంబరు ఒకటో తేదికి బదిలీ అయిన స్థానాల్లో ఉద్యోగులు బాధ్యతలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అందుకు అనుగుణంగా అధికారులు బదిలీల ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. ఇక, వాణిజ్య పన్నుల శాఖలో బదిలీలను ఆపాలంటూ ఏపీ కమర్షియల్ ట్యాక్స్ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో 2.0 పునర్వ్యవస్థీకరణ పేరిట జరిగిన తప్పిదాలపై విచారణ చేపట్టి, వాటిని సరిదిద్దాకే బదిలీలు చేపట్టాలని కోరుతున్నారు. గత 5 సంవత్సరాలలో వాణిజ్య పన్నుల శాఖలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు చేయాలని, కమర్షియల్ ట్యాక్స్‌లో ఉన్నతాధికారుల అవినీతిపై ఏసీబీ దర్యాప్తు చేయాలని డిమాండు చేస్తున్నారు. అవేవీ పట్టించుకోకుండా ఆ శాఖ అధికారులు బదిలీల ప్రక్రియను చేపడుతున్నారు. ఈ నెల 31వ తేది లోపు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. గతేడాదే అధిక శాతం ఉద్యోగులు బదిలీ అయ్యారు. దీంతో ఇప్పుడు నోడల్ డివిజన్ పరిధిలోని చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కడప జిల్లాల నుంచి సుమారు 120 మంది మాత్రమే బదిలీ అయ్యే అవకాశం ఉంటుందంటున్నారు.

జడ్పీలో వేగంగా బదిలీల ప్రక్రియ

జడ్పీలో ఎంపీడీవోల బదిలీ ప్రక్రియ వేగంగా సాగుతోంది. గురువారానికి దరఖాస్తుల పరిశీలన కూడా పూర్తి చేయనున్నట్లు తెలుస్తోంది. జడ్పీ పరిధిలో ఎంపీడీవోల నుంచి అటెండర్ వరకు వివిధ క్యాడర్లకు సంబంధించి 575 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఐదేళ్లు ఒకే చోట సర్వీసు పూర్తి చేసుకున్న 297 మందికి బదిలీలు అనివార్యమైంది. ఐదేళ్లు పూర్తి కాని వారు కూడా వివిధ స్థానాలకు బదిలీ కావాలని ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలతో దరఖాస్తు చేసుకున్నారు.

విద్యుత్ శాఖలో 72 మందికి తప్పనిసరి

సదరన్ డిస్కం పరిధిలో బదిలీ ప్రక్రియపై కసరత్తు కొనసాగుతోంది. ఈ నెల 31వ తేదిలోపు బదిలీలు పూర్తి చేయాల్సి ఉంది. ఉద్యోగులు కూడా తమకు కావాల్సిన చోటు బదిలీ చేయించుకునేందుకు ఎమ్మెల్యే, ఎంపీల నుంచి సిఫార్సు లేఖలతో దరఖాస్తులు చేశారు. డిస్కం పరిధిలో వివిధ హోదాలలో 72 మంది ఒకే స్థానంలో ఐదేళ్ల సర్వీసును పూర్తి చేసుకున్నారు. వీరికి బదిలీ తప్పడం లేదు. 5 ఏళ్లు పూర్తి చేసుకున్న వారిలో ఎస్ఈ, జీఎంలు ముగ్గురు, ఈఈలు 14, డీఈలు 24, ఏఈలు 18, సీజీఎంలు 2, ఏఏవోలు 12 మంది ఉన్నారు.

గ్రామ సచివాలయాల్లో నాలుగు శాఖలకు మినహాయింపు

మొదట్లో గ్రామసచివాలయాల్లో పనిచేస్తున్న అనిమల్ హస్బెండరీ, అగ్రికల్చర్, సిరికల్చర్, ఏఎన్ఎంలను ఆయా శాఖల్లో సర్దుబాటు చేయాలని ప్రభుత్వం చూసింది. అయితే బుధవారం వీరికి బదిలీల్లో మినహాయింపు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ శాఖలో వీరి బదిలీల ప్రక్రియను నిలిపివేశారు.

ఎరువుల అమ్మకాలకు 'సహకారం'



చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 28: రైతులకు సింగిల్ విండోల ద్వారా విత్తనాలు, ఎరువులు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ దిశగా లైసెన్సు తీసుకోవడం వంటి ప్రక్రియలు పూర్తి చేయాలని ఆదేశించింది. గత వైసీపీ ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను (సింగిల్ విండోలు) నిర్వీర్యం చేసింది. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఎరువులకోసం అక్కడికి వెళితే ముందుగా డబ్బులు కట్టించుకున్న తర్వాతే ఇచ్చేవారు. ఇక, గత ఐదేళ్ల సింగిల్ విండోల్లో ఎరువులు, విత్తనాల అమ్మకాలు లేకపోవడంతో వాటి లైసెన్సులను పునరుద్ధరించు కోలేదు. జిల్లా సహకారకేంద్ర బ్యాంకు పరిధిలో 37 సింగిల్ విండోలు ఉంటే, వాటిలో 14కు మాత్రమే లైసెన్సులు ఉన్నాయి. దీంతో ఎరువులకోసం ప్రైవేటు డీలర్లపై రైతులు ఎక్కువగా ఆధారపడాల్సి వచ్చింది. వారు సీజన్‌లో యూరియా, మిశ్రమ ఎరువులను అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి.. సింగిల్ విండోలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంది. విత్తనాలు, ఎరువులు సింగిల్ విండోల ద్వారా రైతులకు అందించాలని నిర్ణయించింది. దీంతో లైసెన్సులు పునరుద్ధరించుకోవాలని విండోల సీఈవోలను సహకారశాఖ అధికారులు ఆదేశించారు. కొత్త లైసెన్సులు తీసుకోవాలన్నా, ఉన్న వాటిని పునరుద్ధరించుకోవాలన్నా నిబంధనలు అడ్డువస్తున్నాయి. లైసెన్సు ఇవ్వాలంటే సింగిల్ విండోల్లో ఉద్యోగి బీఎస్సీ (అగ్రి) లేదా డిప్లొమా చేసుండాలి. ఆ విద్యార్హత లేకుంటే 15 రోజుల డిప్లొమా కోర్సు పూర్తిచేయాలి. దీనికి రూ.15 వేలు ఖర్చవుతుంది. జిల్లాలోని అన్ని సంఘాల్లోనూ ఎరువుల వ్యాపారం ప్రారంభించడాకి కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైంది. డీసీసీబీ, సహకార, వ్యవసాయ శాఖలు, మార్క్‌ఫెడ్‌ల సమన్వయంతో పనిచేస్తే ప్రభుత్వం ఆశించిన ఫలితాలు సాకారమవ్వడం ఖాయం.

శిక్షణ ఇప్పిస్తాం

సింగిల్ విండోల సిబ్బందికి ఎరువుల అమ్మకాలపై వ్యవసాయశాఖ అధికారులతో సంప్రదించి 15రోజుల డిప్లొమా కోర్సులో శిక్షణ ఇప్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. వెంటనే అన్ని సింగిల్ విండోలు ఎరువుల అమ్మకాల కోసం వ్యవసాయశాఖ ద్వారా లైసెన్సులు పొందాలని ఆదేశించాం.

- వనజ, డీఎల్‌సీవో, చిత్తూరు

స్థల సమస్య తీర్చాలని కలెక్టరేట్ వద్ద ఆత్మహత్యాయత్నం



చిత్తూరు, ఆగస్టు 28: స్థల సమస్య పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించారు. కిరోసిన్‌ను ఒంటిపై పోసుకున్న అయన్ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కుప్పం మండలం కూర్మాయిపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం(34)కు ఒకటిన్నర సెంటు ఇంటి స్థలం ఉంది. ఆయనకు తెలియకుండా ఆ స్థలాన్ని అతడి అక్క అమ్మేసింది. స్థలాన్ని ఇప్పించాలని ఐదేళ్ల నుంచి సుబ్రహ్మణ్యం కుప్పం తహసీల్దార్లు, ఆర్డీవో, కలెక్టర్లకు విన్నవించినా ఫలితం లేకపోయింది. దీంతో బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో కలెక్టరేట్‌కు చేరుకున్నారాయన. తనవెంట తెచ్చుకున్న కిరోసిన్ ఒంటిపై పోసుకుని ఆత్మహత్యకు యత్నించారు. పోలీసులు అప్రమత్తమై అతడిని అదుపులోకి తీసుకున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ అందుబాటులో లేకపోవడంతో డీఆర్వో పుల్లయ్య వద్దకు తీసుకెళ్లారు. పూర్తి సమాచారం తెలుసుకున్న డీఆర్వో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి ఇంటికి పంపించారు.

అన్ని విధాలా మోసపోయాం

- మున్సిపాలిటీలో ఉద్యోగానికి డబ్బు కట్టాం
- 24 నెలలు పనిచేసినా జీతం లేదు
- చివరకు ఇళ్లకు పంపేశారంటూ బాధితుల ఆవేదన



కౌన్సిలర్ చేతిలో మోసపోయామంటున్న బాధితులు - మొగిలీశ్వర్ పేరిట గత కమిషనరు ఇచ్చిన గుర్తింపు కార్డు

పలమనేరు, ఆగస్టు 28: ఉద్యోగం తీసిస్తానని ఓ కౌన్సిలరు డబ్బులు తీసుకున్నారు. అధికారులేమో గుర్తింపుకార్డులిచ్చి.. పనులు కేటాయించారు. 24 నెలలు పనిచేశాక ఇళ్లకు పంపేశారు. ఇలా రెండేళ్ల పనికి జీతమూ లేదు. ఉద్యోగానికి ఇచ్చిన డబ్బులూ పోయాయి. ఉద్యోగమూ లేదు. ఇలా అన్ని విధాలా మోసపోయామంటున్నారు ఓ వైసీపీ కౌన్సిలరు బాధితులు. వీరు బుధవారం మీడియాతో మాట్లాడారు. పలమనేరు మున్సిపాలిటీలో ఉద్యోగాలు పర్మినెంట్ చేస్తారని, పీఎఫ్, సెలవులు వంటి ప్రయోజనాలు ఉంటాయని జండామరం ప్రాంతానికి చెందిన ఓ కౌన్సిలరు తమను నమ్మించినట్లు బాధితులు తెలిపారు. వాటర్ వర్క్సులో పనికోసం తమ వద్ద డబ్బు వసూలు చేశారన్నారు. తామంతా అప్పు చేసి డబ్బు కట్టి 2022 జూలైలో ఉద్యోగాల్లో చేరారు. వీరిలో ఆర్.మొగిలీశ్వర్ రూ.2.20 లక్షలు.. జె.అన్సర్ బాషా, ఎస్.ముబారక్ రూ.1.10 లక్షలు చొప్పున.. ఎస్.సమీర్ రూ.1.50 లక్షలు కట్టినట్లు చెప్పారు. వీరిలో ఆర్.మొగిలీశ్వర్‌కు గడ్డూరులోని జగనన్న కాలనీలో.. మిగిలిన ముగ్గురికి కురప్పల్లి జగనన్నకాలనీలో వాటర్ వర్క్సుకోసం పనులు అప్పగించారు. ఈ మేరకు అప్పటి కమిషనరు కిరణ్‌కుమార్ గుర్తింపు కార్డులు జారీ చేశారు. వీరిలో సమీర్ తండ్రి అన్వర్‌బాషా మున్సిపాలిటీలో ఉద్యోగం వస్తుందన్న ఆశతో డబ్బులు కట్టి కురప్పల్లి జగనన్న కాలనీలో తాగునీటి సరఫరా పనులు చేస్తూ చనిపోయాడు. దీంతో ఎస్.సమీర్‌ను పిలిపించి అతడి తండ్రికి ఇచ్చిన గుర్తింపు కార్డు తీసుకొని సమీర్ పేరున గుర్తింపు కార్డు ఇచ్చారు. ఇలా వీరంతా 24 నెలలు పనిచేశారు. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ ముందు అప్పటి కమిషనరు బదిలీ కావడంతో, ఈ నలుగురిని ఇళ్లకు పంపించారు. వీరు పనిచేసిన దాదాపు 24 నెలలకు చిల్లిగవ్వకూడా ఇవ్వలేదు. ఒక్కొక్కరికి నెలకు దాదాపు రూ.17 వేలు ఇవ్వాల్సి ఉంది. కట్టిన డబ్బులు పోయి.. రెండేళ్ల పనికి జీతం లేక.. చివరకు ఉద్యోగమూ పోవడంతో నిలువునా మోసపోయామంటూ వారు ఆవేదన వ్యక్తంచేశారు. నిబంధనల ప్రకారం ఇలా ఉద్యోగంలో తీసుకునే వెసులుబాటు లేదని అంటున్నారు. అలాంటప్పుడు ఒక కౌన్సిలరు మాటతో వీరిని ఎలా చేర్చుకున్నారు? పనులు ఎలా అప్పగించారు? ఈ వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉందనేది చర్చనీయాంశంగా మారింది.

నా దృష్టికి రాలేదు

నేను కమిషనరుగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆ నలుగురు మున్సిపాలిటీలో పని చేయలేదు. మున్సిపాలిటీల్లో ఆప్కాస్ ద్వారా మాత్రమే నియామకాలు ఉంటాయి. వీరి నియామకాలు.. డబ్బులు ఇవ్వడం.. గుర్తింపు కార్డుల విషయం.. ఇవేవీ నా దృష్టికి రాలేదు.

- రమణారెడ్డి, మున్సిపల్ కమిషనరు

ఒకటి నుంచి పాఠశాలల్లో స్వచ్ఛత పఖ్వాడా

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 28: జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు, కళాశాలల్లో సెప్టెంబరు ఒకటి నుంచి 15వ తేదీ వరకు స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి తెలిపారు. 1న ప్రతిజ్ఞ, 2న తల్లిదండ్రుల సమావేశం, 3న పారిశుధ్యంపై జాగ్రత్తలు, 4న గ్రామాల సందర్శన, 6న నీటి సంరక్షణ, 7న పరిశుభ్రతపై పోటీలు, 9న చేతుల శుభ్రత, 11న వ్యక్తిగత శుభ్రత, 12న స్వచ్ఛత పఖ్వాడా ఎగ్జిబిషన్, 13, 14తేదీల్లో భవిష్యత్తు ప్రణాళిక, 15న బహుమతుల ప్రదానం ఉంటాయని వివరించారు.

కొనసాగుతున్న వర్క్ అడ్జస్ట్‌మెంట్

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 28: టీచర్ల అడ్జస్ట్‌మెంట్‌లో భాగంగా డివిజన్ స్థాయి ప్రక్రియ కొనసాగుతోంది. డివిజన్ స్థాయిలో సర్‌ప్లస్ టీచర్ల నుంచి అభ్యంతరాలను పరిశీలన చేసి, వాటిని సవరించిన అనంతరం వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేయనున్నారు. అనంతరం ఎస్జీటీ టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్ జరగనుంది.

అన్న క్యాంటీన్‌కు రూ.10లక్షల వితరణ

పుంగనూరు, ఆగస్టు 28: అన్న క్యాంటీన్ నిర్వహణకు రూ.10 లక్షల చెక్కును పుంగనూరు టీడీపీ నేత ఆర్బీటీబాబు బుధవారం సీఎం చంద్రబాబునాయుడుకు అందజేశారు. అమరావతి సచివాలయంలో సీఎంను కలిసి అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షుడు శ్రీరామ్‌చిన్నబాబు, టీడీపీ నాయకులు పట్నా దొరస్వామి నాయుడు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న నేత




ఏటీఎం కార్డు ఏమార్చి మహిళకు టోకరా

చౌడేపల్లె, ఆగస్టు 28: ఏటీఎం కార్డు వినియోగంలో సహకరించాలని కోరిన మహిళను ఓ వ్యక్తి మోసం చేసిన వైనమిది. వివరాలివి. సోమల మండలం ఇరికిపెంటకు చెందిన ధనశేఖర్ భార్య చెంగమ్మ ఈనెల 22న చౌడేపల్లె వచ్చింది. భర్త ధనశేఖర్‌కు చెందిన యునియన్ బ్యాంకు ఖాతా ఏటీఎం ద్వారా కెనరా బ్యాంకు ఏటీఎంలో బ్యాలెన్స్ చెక్ చేయాలని భావించింది. ఈక్రమంలో అక్కడ ఓ వ్యక్తిని బ్యాలన్స్ చెక్ చేయాలని కార్డు ఇచ్చింది. పిన్ కూడా చెప్పింది. అతను బ్యాలెన్స్ చెక్ చేసి ఆ కార్డుకు బదులు మరో కార్డు ఆమె చేతిలో పెట్టాడు. కార్డు మారిందనే విషయాన్ని నాలుగురోజుల తర్వాత ఆమె గుర్తించింది. అప్పటికే సదరు వ్యక్తి రెండు దఫాలుగా రూ.25వేలు డ్రా చేసేశాడు. సోమల మండలంలోని పెట్రోల్ బంకులో ద్విచక్రవాహనానికి కార్డు ద్వారా రూ..100 పెట్రోల్ పట్టించుకుని తిరుపతి వైపు వెళ్లిపోయినట్లు పోలీసులు సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. బాధితురాలు ఫిర్యాదుపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.




సోమల బంకులో పెట్రోల్ వేయించుకుంటున్న నిందితుడు

శ్రీహరి సన్నిధిలో ఉట్లోత్సవం



ఆలయం ముందు ఉట్టి కొడుతున్న భక్తులు



మలయప్పస్వామి, కృష్ణస్వామి ఊరేగింపు

తిరుమల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా తిరుమలలో బుధవారం ఉట్లోత్సవం వేడుకగా జరిగింది. శ్రీవారి ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం నిర్వహించిన మరుసటి రోజు ఉట్లోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా మలయప్పస్వామి బంగారు తిరుచ్చిపై, కృష్ణస్వామి మరో తిరుచ్చిపై తిరుమాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా మలయప్పస్వామి, కృష్ణస్వామి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా పెద్దజీయర్ మఠానికి తీసుకొచ్చి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్దజీయర్ మఠం, హథీరాంజీమఠం హారతి పొంది తిరిగి ఆలయం వద్దకు వేంచేశాక శ్రీవారి ఆలయం ముందు గొల్లమండపం పక్కనే ఉట్లోత్సవం వేడుకగా జరిగింది. స్థానిక యువతతో పాటు పలువురు భక్తులు కూడా పాల్గొన్నారు. టీటీడీ జీయర్‌స్వాములు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

లక్కీడిప్‌లో శ్రీవారి అంగప్రదక్షిణ టోకెన్లు

రూ.500 డిపాజిట్ తప్పనిసరి : టీటీడీ

తిరుమల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరవాసులతో పాటు తిరుమలవాసులకు ప్రతి శనివారం కేటాయిస్తున్న 250 శ్రీవారి ఆలయ అంగప్రదక్షిణ టోకెన్లను ఇకపై లక్కీడిప్ ద్వారా కేటాయించనున్నట్లు టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది. గతంలో రోజూ 750 టోకెన్లను తిరుమలలోనే ఆఫ్‌లైన్ ద్వారా కేటాయించేవారు. అయితే క్యూలైన్లలో భక్తుల నిరీక్షణ సమయాన్ని మరింత తగ్గించే ఉద్దేశంతో ఈ టోకెన్లను కూడా ఆన్‌లైన్ ద్వారానే కేటాయించేందుకు గత ప్రభుత్వ హయాంలో నిర్ణయం తీసుకున్నారు. అయితే కొందరు స్థానికులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించిన నేపథ్యంలో ప్రతి శనివారం 250 టోకెన్లను స్థానిక ఎమ్మెల్యేకు బదిలీ చేస్తూ వచ్చారు. ఆన్‌లైన్‌లో మిగతా రోజులకు 750 టోకెన్లు కేటాయిస్తే శనివారం 500 టోకెన్లు మాత్రమే కేటాయించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి శనివారం ఇచ్చే ఈ 250 టోకెన్లను కూడా ఆన్‌లైన్‌లోనే పెట్టాలని టీటీడీ తాత్కాలికంగా నిర్ణయం తీసుకుని గత శనివారానికి సంబంధించిన టోకెన్లను విడుదల చేశారు. ప్రస్తుతం ఈ విషయంలో టీటీడీ శాశ్వత నిర్ణయం తీసుకుంది. అంగప్రదక్షిణ టోకెన్లు కావాల్సిన భక్తులు గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తమ ఆధార్ కార్డుతో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. వీరికి సాయంత్రం 5 గంటలకు లక్కీడిప్ ద్వారా టోకెన్లు కేటాయిస్తారు. డిప్‌లో టోకెన్లు పొందిన భక్తులు వారి మొబైల్ ఫోన్లకు ఎస్ఎంఎస్ రూపంలో సమాచారం అందించడంతో పాటు ఆన్‌లైన్‌లో కూడా ఆ సమాచారం ఉంచుతారు. డిప్ ద్వారా టోకెన్లు పొందిన భక్తులు ఆన్‌లైన్‌లోనే రూ.500 డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. లక్కీడిప్ ద్వారా టోకెన్లు పొందిన భక్తులు తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో తమ ఆధార్ కార్డు చూపి శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అంగప్రదక్షిణ టోకెన్లు పొందాల్సి ఉంటుంది. వీరిని శనివారం వేకువజామున అంగప్రదక్షిణకు అనుమతిస్తారు. అనంతరం భక్తులు చెల్లించిన రూ.500 డిపాజిట్‌ను తిరిగి వారి ఖాతాల్లోకే టీటీడీ జమచేస్తుంది. తిరుపతి నియోజకవర్గానికి చెందని భక్తులు లక్కీడిప్‌లో అంగప్రదక్షిణ టోకెన్లు పొందితే డిపాజిట్ తిరిగి చెల్లించమని, అంగప్రదక్షిణకు అనుమతించబోమని టీటీడీ స్పష్టం చేసింది.

స్విమ్స్‌లో రోగి అదృశ్యం

అధికారులు పట్టించుకోకపోవడంతో వెస్ట్ పోలీసులకు కుమారుడి ఫిర్యాదు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 28 : ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్న రోగుల భద్రత పూర్తిగా ఆ ఆస్పత్రి అధికారులదే. అయితే ఆరోగ్యం క్షీణించి ఎంఐసీయూలో చికిత్స పొందుతున్న రోగి అకస్మాత్తుగా కనిపించకుండా పోయినా తమకు సంబంధం లేదంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పరిస్థితి స్విమ్స్‌లో నెలకొంది. స్విమ్స్‌లో డాక్టర్లకే రక్షణ లేదంటూ వారం రోజులుగా జూనియర్ డాక్టర్లు నిరసన కార్యక్రమాలు చేపట్టిన విషయం మరువక ముందే చికిత్స పొందుతున్న రోగి అదృశ్యం అవడం స్విమ్స్‌లో సెక్యూరిటీ నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచింది. బాధితుల కథనం మేరకు...అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం బూరగమాకులపల్లెకు చెందిన టి.సీతారామప్పను చికిత్స కోసం కుటుంబ సభ్యులు మంగళవారం స్విమ్స్‌కు తీసుకువచ్చారు. ఓపీలోని వైద్యులు పరీక్షించి ఊపిరితిత్తుల్లో నీరు చేరిందని, చికిత్స అందించి ఆ నీటిని తొలగించాలని చెప్పారు. ఇందుకు తక్షణమే అడ్మిట్ కావాల్సి ఉంటుందని డాక్టర్లు చెప్పడంతో సీతారామప్పను ఆయన కుమారుడు విశ్వనాథ్ తన వద్ద ఉన్న రూ.5 వేలు చెల్లించి అడ్మిట్ చేశారు. శ్రీపద్మావతి భవనంలోని నాలుగో అంతస్థులో ఉన్న ఎంఐసీయూలో అడ్మిషన్‌లో ఉన్న సీతారామప్పను వైద్యులు మంగళవారం రాత్రి మరోసారి పరీక్షించి బుధవారం చికిత్స చేస్తామని, అప్పటి వరకు వాడమంటూ కొన్ని మందులు రాసిచ్చారు. ఆ మందులు వేసుకొని పడుకున్న సీతారామప్ప మంగళవారం అర్ధరాత్రి మూత్ర విసర్జన కోసం ఒకసారి లేవడంతో విశ్వనాథ్ తీసుకువెళ్లి తిరిగి తీసుకువచ్చి పడుకోబెట్టాడు. విశ్వనాథ్ కూడా ఆ పక్కనే నిద్రకు ఉపక్రమించాడు. తిరిగి రెండు గంటల సమయంలో విశ్వనాథ్ లేచి చూడగా పడకపై సీతారామప్ప కనిపించలేదు. దీంతో కంగారు పడిన విశ్వనాథ్ ఆ భవనం అంతా వెతికినా తండ్రి కనిపించకపోవడంతో సెక్యూరిటీ సిబ్బందికి విషయం చెప్పాడు. వారే మాత్రం పట్టించుకోకుండా ఇక్కడే ఎక్కడో ఉంటాడులే అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో తెల్లవారుజాము వరకు వెతుకుతూనే ఉన్నాడు. బుధవారం మరోసారి స్విమ్స్ ఆవరణ మొత్తం వెతికినా ఫలితం లేకపోవడంతో చివరకు విషయాన్ని స్విమ్స్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాడు. దీంతో ఉదయం 10 గంటల సమయంలో ఎంఐసీయూ వార్డుకు వచ్చిన స్విమ్స్ అధికారులు విచారణ చేపట్టారు. రోగిని భద్రంగా చూసుకోకుండా ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని విశ్వనాథ్‌నే మందలించారు. మీరు చెల్లించాల్సిన నగదు బ్యాలెన్స్ చెల్లించాలని ఒత్తిడి చేశారు. తన తండ్రి ఆచూకీ తెలిశాకే నగదు పూర్తిగా చెల్లిస్తానని విశ్వనాథ్ అధికారులకు తెగేసి చెప్పాడు. ఎంఐసీయూలో ఉన్న తన తండ్రి బయటకు వచ్చే అవకాశం లేదని కనీసం ఆయన మెట్లు కూడా దిగలేడని ఎంత చెప్పినా వారు వినిపించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చేసేదేమీలేక బుధవారం మధ్యాహ్నం వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన తండ్రి ఆరోగ్య పరిస్థితి మాత్రమే బాగాలేదని, మానసిక పరిస్థితి బాగానే ఉందని ఇలా ఆయన చెప్పకుండా ఒక్కడే ఎక్కడకూ వెళ్లడని పేర్కొన్నాడు. అయిన వారిని వైద్యం కోసం తీసుకువచ్చే సహాయకులను కనీసం వార్డుల్లోకి కాదు కదా భవనంలోకి కూడా అనుమతించకుండా స్విమ్స్ సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని, దీంతో భవనం బయటే రాత్రిళ్లు సహాయకులు ఇబ్బంది పడుతూ ఉండాల్సి వస్తోందని తెలిపాడు.



సీతారామప్ప

బండరాయితో కొట్టి చంపేశారు



చిత్తూరు, ఆగస్టు 28: బండరాయితో మోది గుర్తు తెలియని వ్యక్తిని హత్య చేసిన ఘటన చిత్తూరులో బుధవారం చోటుచేసుకుంది. సీఐ నెట్టికంఠయ్య తెలిపిన ప్రకారం.. సంతపేట ఇందిరానగర్ నుంచి వీరభద్రకాలనీకి వెళ్లే మట్టి రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి(27)పై కొందరు బండరాయితో మోదడంతో మృతిచెందాడు. మృతుడి వివరాలు, చంపడానికి కారణాలు తెలియాల్సి ఉంది. వివరాలు తెలిసినవారు 9491074517కు తెలియజేయాలని కోరారు.

ఎనిమిది మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 28: గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా ఎనిమిది మండలాల్లో తేలికపాటి వర్షపాతం నమోదైంది. కార్వేటినగరంలో 7.6, నింద్ర 6.4, కుప్పం 6.0, వెదురుకుప్పం 5.2, నగరి 5.2, పులిచెర్ల 2.0, రొంపిచెర్ల 1.4, పెనుమూరులో 0.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

గంజాయి రవాణా కేసులో ముగ్గురి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 28: గంజాయి రవాణా కేసులో ముగ్గురు నిందితులను బుధవారం రాత్రి అరెస్టు చేసినట్లు తిరుపతి ఈస్ట్ డీఎస్పీ వెంకటనారాయణ తెలిపారు. ఐదుగురు స్నేహితులు ఓ ముఠాగా ఏర్పడి గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో నిఘా పెట్టామన్నారు. విక్రయించడానికి తీసుకెళుతున్న దాదాపు రూ.60 వేల విలువైన నాలుగు కిలోల గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. తిరుపతికి చెందిన సాయిభాను, భరత్‌కుమార్‌రెడ్డిని, ఎస్ఆర్ పురం మండలం కొండేపల్లికి చెందిన ఈశ్వర రెడ్డిని అరెస్టు చేశామన్నారు.

కుప్పం రెస్కోలో ఇక నాణ్యమైన సేవలు!

కొత్తగా 12 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ప్రణాళిక ● మొండి బకాయిదారులకు నోటీసులు

కుప్పం, ఆగస్టు 28: కుప్పం రెస్కోలో గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణలు సాగడమే కాదు.. సంస్థ సామర్థ్యం పెంపునకు సమాంతరంగా కసరత్తు నడుస్తోంది. కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాలతోపాటు వి.కోట మండలంలోని 8 పంచాయతీలు కుప్పం గ్రామీణ విద్యుత్తు సహకార సంస్థ (రెస్కో) పరిధిలోకి వస్తాయి. ఇప్పుడు 154 ఫీడర్లు ఉన్నాయి. ప్రస్తుత వినియోగానికి ఇవి చాలక.. 50 శాతం ఓవర్ లోడ్‌తో పనిచేస్తున్నాయి. అందుకే ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ కాలిపోతూ, ఇతర సమస్యలతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతోంది. గత అయిదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఈ సమస్యను పట్టించుకోకపోగా, అవినీతి, అక్రమాలతో సంస్థను నిర్వీర్యం చేసి విడిచిపెట్టింది. టీడీపీ అధికారంలోకి రాగానే రెస్కోలో అవినీతిపై విచారణతో పాటు ప్రధాన సమస్యపైనా దృష్టి పెట్టింది. రెస్కో సామర్థ్యాన్ని పెంచడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎస్పీడీసీఎల్ అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో తిరుపతి ఎస్ఈ (ఆపరేషన్స్) సురేంద్రనాయుడు జూలై 20న పర్యటించి సమస్యలపై అధ్యయనం చేశారు. సరికొత్తగా 12 అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ముందుకు వచ్చింది. దీనికి ప్రభుత్వం ఆమోదించింది. ప్రస్తుతం స్థలాలకోసం అన్వేషణ జరుగుతోంది. మరోవైపు హై ఓల్టేజ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం (హెచ్‌వీడీఎస్)లనే చిన్న ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసే కసరత్తు కూడా ప్రారంభించారు. ఈ ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ కింద నాలుగైదు వ్యవసాయ సర్వీసులు మాత్రమే ఉంటాయి. ఒకవేళ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురైతే కేవలం ఆ నలుగురైదుగురు రైతులకు మాత్రమే సమస్య పరిమితమవుతుంది. ఇప్పటికే వి.కోట, శాంతిపురం మండలాల్లో చాలాచోట్ల వీటిని ఏర్పాటు చేశారు. కుప్పం, గుడుపల్లె, రామకుప్పం మండలాల్లో ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు రెస్కోలో పేరుకు పోయిన రూ.125 కోట్ల మొండి బకాయిలకు సంబంధించి నోటీసులూ జారీ చేశారు. ఒకటీ అరా బకాయిలు వసూలు అవుతున్నాయి. ఈ ప్రక్రియకు కూడా రాజకీయ సిఫారసులు అడ్డు వస్తున్నట్లు తెలిసింది. వీటిని దాటుకుని వసూలు చేయగలిగితేనే రెస్కో ఆర్థిక పరిస్థితి నిలకడగా ఉంటుంది.



కుప్పంలోని రెస్కో ప్రధాన కార్యాలయం

ఎస్పీడీసీఎల్‌కు అనుసంధానం



సీఎం చంద్రబాబు ఆదేశాలతో సంస్థలో పలు అభివృద్ధి చర్యలు నడుస్తున్నాయి. అలాగే రెస్కోను సాంకేతికంగా ఎస్పీడీసీఎల్‌కు అనుసంధానం చేయడానికి కసరత్తు నడుస్తోంది. ఆన్‌లైన్ సేవలన్నీ, ఎస్పీడీసీఎల్ ద్వారా నడపగలిగితే వినియోగదారులకు బిల్లింగ్ వంటి వ్యవహారల్లో నాణ్యమైన, కచ్చితమైన సేవలు అందుతాయి. ఇందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్ రూపకల్పన ప్రయత్నాలు సాగుతున్నాయి.

- సోమశేఖర్, రెస్కో ఎండీ

సామాజిక పనుల్లో రూ.24.88 లక్షల అక్రమాలు



పలమనేరు, ఆగస్టు28 : మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన గ్రామీణ ఉపాధి హామీ పనులపై బుధవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. 10 పంచాయితీల్లో 639 పనులు చేశారు. రూ. 4.44 కోట్ల విలువ చేసే పనులకు సంబంధించి సమగ్ర తనిఖీలు చేశారు. రూ.24.88 లక్షల మేర అక్రమాలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఇందుకు మండల ఏపీఓ, టీఏ, జేఈ, ఎఫ్.ఎఫ్‌లను బాధ్యులుగా నిర్ధారించారు. శ్రీనివాసులురెడ్డి, మురళి అనే టీఏ సిబ్బందికి నుంచి రూ. 15వేల చొప్పున రికవరి చేయాలని నిర్ణయించారు. అక్రమాలపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామని అధికారులు తెలిపారు. తనిఖీలో విజిలెన్స్ అధికారిభవాని, డీఆర్‌డీఏ ఏపీడీ రవి, ఏపీఓ రవికుమార్, ఎంపీడీఓ రాజేష్ పాల్గొన్నారు.

వాస్తు దోషంతో వందేళ్ల వృక్షానికి మంగళం?!



సదుం పోలీసు స్టేషన్ వద్దనున్న వృక్షం

సదుం, ఆగస్టు 28: పోలీసుల సెంటిమెంటు కారణంగా ఏళ్లనాటి ఈ చెట్టు కనుమరుగవుతుందేమోనని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సదుంలోని పోలీసు స్టేషన్ ప్రహరీ ఈశాన్యం భాగంలో చాన్నాళ్లుగా ఓ వటవృక్షం ఉంది. దీనివల్ల స్టేషన్‌కు వాస్తు దోషం ఉందనే అపోహతో నేలకూల్చడానికి ఇటీవల పోలీసు సిబ్బంది సిద్ధమయ్యారని తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు బాధపడుతున్నారు. ఆ వృక్షంతో తమ అనుబంధం తెగిపోతుందంటున్నారు. వాస్తు రీత్యా ఈశాన్య భాగం బరువు ఉండకూడదని కొందరు భావిస్తారు. చిన్నపాటి మార్పుతో ఈ దోషాన్ని తొలగించుకునే అవకాశం ఉందంటున్నారు. కార్యాలయ సిబ్బంది, గ్రామస్థులు తరచూ ఈ చెట్టుకు పూజలు చేస్తుంటారు. వృక్షం స్థలాన్ని స్టేషన్ వెడల్పునకు నేరుగా వదిలితే ప్రహరీకి ఈశాన్యంలో మర్రిచెట్టు ఉండదు. బయట ప్రదేశంలో మిగిలిపోతుంది. స్టేషన్ ముందు ఐదు అడుగుల జాగాలో చిన్నపాటి పూలమొక్కలు పెంచుకోవచ్చునని లేదా స్టేషన్ సిబ్బంది ద్విచక్ర వాహనాలు చెట్టు నీడలో పార్కింగ్‌కు ఉపయోగించుకోవచ్చునని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు.

31న జాబ్‌మేళా

చిత్తూరు రూరల్, ఆగస్టు 28: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 31వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి పద్మజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టయోట, హోండా కంపెనీలలో పలు పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. పదవ తరగతి, ఐటీఐ, డిప్లొమా, లేదా ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాలు లోపు ఉన్నవారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు పూర్తి బయోడేటా, ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డుతో రావాలని తెలిపారు. ఎంపికైన వారికి రూ.20 వేల వరకు వేతనాలు అందిస్తారని వెల్లడించారు. ఇతర వివరాలకు 9704731410ను సంప్రదించాలని కోరారు.

అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలు పెంపొందించుకోవాలి

ఎకనమిక్స్ జాతీయ సదస్సులో వక్తల మనోభావం



సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీలంక ప్రతినిధి ప్రొఫెసర్ అమృతలింగం తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) ఆగస్టు 28: అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలను పెంపొందించుకోవడం ద్వారా ఆయా దేశాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని శ్రీలంకలోని కొలంబో యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.అమృతలింగం అభిప్రాయపడ్డారు. ఇంటర్నేషనల్ ఎకనమిక్ రిలేషన్స్ ద సస్టైనబుల్ డెవెలప్‌మెంట్ ఛాలెంజెస్ అంశంపై ఎస్వీయూ, పద్మావతి యూనివర్సిటీలు సంయుక్తంగా బుధవారం జాతీయ సదస్సు చేపట్టాయి. పద్మావతి వర్సిటీ సావేరి హాల్లో చేపట్టిన ప్రారంభ సభలో ప్రొఫెసర్ అమృతలింగం కీలకోపన్యాసం చేశారు. అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలను పెంపొందించుకునే సందర్భంలో శ్రీలంక విఫలమైందన్నారు. కరోనా సమయంలో చైనా సహకారంతో ముందుకు వెళ్లాల్సి ఉండేదని తెలిపారు. భారతదేశంతో వ్యాపార, వాణిజ్య సంబంధాలను పెంచుకోవడం ద్వారా శ్రీలంకకు ఎంతో ప్రయోజనం చేకూరే అవకాశం ఉందన్నారు. అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల ద్వారానే ఒక దేశపు జాతీయ ఆదాయంలో స్థిరమైన అభివృద్ధి కనిపిస్తుందన్నారు. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన లక్ష్య సాధనకు ప్రతి దేశం సహకారాన్ని అందించాలని కోరారు. ఆర్థిక శాస్త్ర విద్యార్థులు పరిశోధనల వైపు దృష్టి సారించాలని సూచించారు. పద్మావతి వర్సిటీ డీన్ కిరణ్‌ప్రసాద్ మాట్లాడుతూ.. కరోనా, యుద్ధ సమయంలో వివిధ రాష్ట్రాలు, దేశాల మధ్య పరస్పర సహకారం అవసరమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో శాంతి, సామరస్యం సాధించాలంటే దేశాల మధ్య సత్సంబంధాలు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సదస్సు కన్వీనర్లు డాక్టర్ మాధవి, డాక్టర్ సునీత, పలు ప్రాంతాల ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటలసాగు ద్వారా స్థూల జాతీయ ఉత్పత్తి పెంపునకు కృషి

వ్యవసాయశాఖ ప్రత్యేకప్రధానకార్యదర్శి రాజశేఖర్



తిరుపతి రూరల్, ఆగస్టు 28: వ్యవసాయరంగంలో ప్రధానపంటల సాగు, వ్యవసాయ ఉత్పత్తులకు విలువజోడింపు, విదేశాలకు ఎగుమతుల ద్వారా రాష్ట్ర స్థూల జాతీయ ఉత్పతిని పెంచేందుకు కృషి చేయాలని వ్యవసాయశాఖ రాష్ట్ర ప్రత్యేక ప్రధానకార్యదర్శి బి.రాజశేఖర్ తెలిపారు. తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానంలో వికసిత్ ఆంధ్రా-2047 అనే అంశంపై అన్ని జిల్లాల వ్యవసాయాధికారులు, ఎన్జీరంగా వ్యవసాయవర్సిటీ శాస్త్రవేత్తలకు బుధవారం ఒకరోజు సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధికి, ప్రధానపంటలలో అధిక దిగుబడి సాధించేందుకు చేపట్టాల్సిన మెరుగైన నూతన విధానాలు, మార్కెట్ అంచనాలకు అనుగుణంగా ప్రధాన పంటలసాగు వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు. పంటల ఉత్పాదకత పెంపు, రాష్ట్రంలో ఉన్న అవకాశాలు, విజన్ ఆంధ్రా-2047లో నిర్ణయించిన లక్ష్యాలను చేరుకునేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అగ్రికల్చర్ డైరెక్టర్ ఎస్.డిల్లీరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రధానపంటల సాగు, విస్తీర్ణం, దిగుబడులు పెంచేందుకు చేపట్టాల్సిన కార్యాచరణను వివరించారు. వ్యవసాయ సాగులో రైతుల ఆదాయం పెంపుతోపాటుగా రాష్ట్ర స్థూల జాతీయ ఉత్పతిని పెంచేందుకు గ్రామస్థాయి నుంచి జిల్లాల వరకు చేపట్టాల్సిన కార్యాచరణపై పలు సూచనలు చేశారు. వ్యవసాయ వర్సిటీ విస్తరణ విభాగ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ప్రమీలారాణి మాట్లాడుతూ వర్సిటీలో పరిశోధన, విస్తరణ విభాగాల ద్వారా లక్ష్యాలను చేరుకునేందుకు కొత్త పరిశోధనలు చేపట్టాలని తెలిపారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి మాట్లాడుతూ మెరుగైన పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రోత్సహించాల్సిన పంటల సాగుని వివరించారు. ప్రొఫెసర్ డాక్టర్ కె.నిర్మల్ రవికుమార్ మాట్లాడుతూ.. వ్యవసాయ ఉత్పత్తుల ట్రేడింగ్, విదేశాలకు ఎగుమతి ద్వారా స్థూల దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. డాక్టర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. పంట కోతల అనంతరం చేపట్టాల్సిన నూతన సాంకేతికత, ప్రాసెసింగ్, వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపువంటి అంశాలను విశదీకరించారు. కాగా తమ తమ జిల్లాలో ఉన్న పంటల సరళిని 26 జిల్లాలకు చెందిన వ్యవసాయాధికారులు వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి జి.ధనుంజయరెడ్డి, శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



కుప్పం, ఆగస్టు 28: ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యమని టీడీపీ నాయీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు వైద్యం శాంతారాం అన్నారు. దేవదాయ శాఖ ఆలయాల్లో నాయీ బ్రాహ్మణ చేతివృత్తి దారుల కనీస వేతనం రూ.25 వేలకు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయ ప్రాంగణంలో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కొబ్బరికాయలు కొట్టి గంగమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. నాయీ బ్రాహ్మణ సాధికార సమితి కుప్పం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్.జ్యోతీశ్, సభ్యులు ఎంఆర్.సుబ్రహ్మణ్యం, వి.రమేశ్, నాగేంద్రబాబు, వి.లోకేశ్, ఎస్.రవి, బీఎస్.మురుగేశ్, నాగరాజులు, గంగరాజులు, రామ్మూర్తి, విజయ్, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజామోదంతోనే ఇకపై ఉపాధి పనులు : చల్లాబాబు



కోళ్ల ఫారాన్ని ప్రారంభిస్తున్న చల్లా బాబు

సోమల, ఆగస్టు 28: గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా కూటమి కూటమి ప్రభుత్వం పని చేస్తోందని నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబు అన్నారు. బుధవారం ఇరికిపెంట, మేటిమందల్లో ఆయన పర్యటించారు. తొలుత ఆయన యువరైతు కోళ్ల ఫారాన్ని ప్రారంభించారు. ఇరికిపెంటలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా చల్లాబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహించకుండా ప్రజల సమస్యలను పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామసభల ఆమోదంతోనే ఉపాధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటోందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులను ఇబ్బందులు పెట్టారని విమర్శించారు. కార్యక్రమాల్లో నాగభూషణం రాయల్, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, కొల్లా హరిప్రసాద్, శ్రీనివాసులు నాయుడు, భానుప్రకాశ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం ప్రైవేట్ క్లినిక్‌ల నిర్వహణ



ప్రైవేటు వైద్యశాలను తనిఖీ చేస్తున్న వైద్యాధికారి

సోమల, ఆగస్టు 28: ప్రైవేటు ఆర్ఎంపీ క్లినిక్‌లు నిబంధనల మేరకు పనిచేయాలని వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం సోమలలోని ఆర్ఎంపీ క్లినిక్‌లను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. సెలైన్లు పెట్టడం, గర్భిణులకు, బాలికలకు వైద్యం నేరమన్నారు. కందూరు, పెద్దఉప్పరపల్లె ప్రైవేటు వైద్యశాలలను డాక్టర్ బాలాజీ, విజయలక్ష్మి తనిఖీ చేశారు. సీహెచ్‌వో అమరనాధ్, సిబ్బంది పాల్గొన్నారు.

మండల ఆఫీసుల్లో ఆలస్యంగా విధులకు హాజరు

సోమల, ఆగస్టు 28: మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులు ఉదయం 11గంటలకు కూడా హాజరు కావడంలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు వారు తెలిపారు. బుధవారం మేటిమంద, ఇరికిపెంట గ్రామాల్లో పర్యటించిన పుంగనూరు నియోజక వర్గం ఇన్‌చార్జి చల్లా బాబు పర్యటనలో పాల్గొన్న టీడీపీ నాయకులు అనంతరం ఎంపీడీవో కార్యాలయంకు చేరుకున్నారు. ప్రజాసమస్యలను చెప్పేందుకు ప్రయత్నం చేయగా అధికారులు,సిబ్బంది అందుబాటులో అధికారులు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు గ్రామాల నుంచి వచ్చి ప్రజలు కూడా ఇబ్బందులు పడ్డారు. అధికారుల కోసం ఎదురు చూడాల్సి వచ్చింది.

నక్కబండలో తాగునీటి కష్టాలు



బోరుమోటర్ తొలగించడంతో ఖాళీగా ఉన్న స్థలం

పుంగనూరు రూరల్, ఆగస్టు28: పట్టణ సమీపంలోని నక్కబండలో బోరు మోటర్, పైపులు, కేబుల్‌వైర్ మాయమైనట్టు స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఎన్నికల ముందు బోరు వేసి మోటర్ బిగించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. అయితే ఇది మూణ్ణాళ్ల ముచ్చటే అయింది. ఎన్నికల ఫలితాలు వెలువడగానే మోటర్, పైపులు కనిపించలేదు. అధికారులను ప్రశ్నిస్తే మోటర్ మరమ్మతుకు గురైనట్లు తెలిపారు. పైపులు, కేబుల్‌వైర్‌పై సమాధానం చెప్పడం లేదు. తాగునీటి సమస్యతో రోజు రోజుకూ తాము ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు బోరు మోటర్ బిగించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని వీరు కోరుతున్నారు.

చౌడేశ్వరి అమ్మవారికి మొక్కులు



గుడుపల్లె, ఆగస్టు 28: మండల పరిధిలోని గుండ్లసాగరంలోని చౌడేశ్వరి అమ్మవారికి గ్రామస్థులు బుధవారం మొక్కులు చెల్లించారు. ఉదయం అమ్మవారి మూల విగ్రహానికి పూజారులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కనమనపల్లె, మిద్దూరు, గుండ్లసాగరం, లక్ష్మీపురం, గుత్తార్లపల్లె గ్రామాలకు చెందిన మహిళలు డప్పువాయిద్యాలతో పిండిదీపాలతో ఊరేగింపుగా చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్ల పెట్టి, అమ్మవారి ఎదుట పిండిదీపాల వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రంగు రంగు పుష్పాలతో అలంకరించి మంగళవాయిద్యాలతో ఊరేగించారు. కర్పూర హారతులు పట్టారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు చుట్టు ప్రక్కల గ్రామాల నుండి ప్రజలు తరలివచ్చారు. వారికి ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



శాంతిపురం, ఆగస్టు 28 : మండలంలో జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ పరిశీలించారు. బుధవారం ఉదయం అబకలదొడ్డి పంచాయతీ తోపు చెరువులో ఆయన పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. వసతుల కల్పనపై కుమార్ ఆరా తీశారు. ప్రస్తుతం మండలంలో 1734 మంది కూలీలు పనులు చేస్తున్నారన్నారు. కూలీల సంఖ్య ఇంకా పెంచాలని ఏపీవోను ఆదేశించారు. ప్రస్తుతం రూ.6.95 కోట్ల పనులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏపీవో హరి,టీఎలు,ఎఫ్ఎలు తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

నేడు కుప్పంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కుప్పం, ఆగస్టు 28: కుప్పంలోని మండల సచివాలయంలో గురువారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరుతుతుందని కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు నిర్వహించే ఈ వేదికలో ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

న్యాయమూర్తిగా బాధ్యతల స్వీకారం



కృష్ణవంశీ

పుంగనూరు రూరల్, ఆగస్టు28: పుంగనూరు కోర్టు న్యాయమూర్తిగా కె.కృష్ణవంశీ బుధవారం బాధ్యతలు చేపట్టారు. పుంగనూరులో పనిచేస్తున్న న్యాయమూర్తి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయనగరానికి చెందిన కె. కృష్ణవంశీ నియమితులయ్యారు. ఆయనకు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది స్వాగతం పలికారు.

కారు ఢీకొని కార్పెంటర్‌కు గాయాలు



వి.కోట, ఆగస్టు 28: వి.కోట-పేర్నాంబట్ రహదారిలో తుపాకిచిన్నేపల్లె క్రాస్ వద్ద గుర్తుతెలియని కారు ఢీకొని బెంగళూరుకు చెందిన కార్పెంటర్ నవీన్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం రాత్రి వి.కోటలో పనిముగించుకుని ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఈ యువకుడిని వెనుక నుంచి కారు ఢీకొంది. కారు ఆగకుండా వెళ్ళిపోయింది. ప్రమాదంలో నవీన్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. ఇతడ్ని కుప్పం పీఈఎస్ వైద్యకళాశాల ఆసుపత్రికి తరలించారు. సీఐ సోమశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాశీవిశ్వేశ్వరస్వామి మాన్యంలో అక్రమణల తొలగింపు



చౌడేపల్లె, ఆగస్టు28: కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ మాన్యంలో గ్రూప్ టెంపుల్స్ ఈవో కమలాకర్ ఆధ్వర్యంలో అక్రమణలు తొలగింపు చర్యలు చేపట్టారు. రెండవరోజు బుధవారం కూడా దేవదాయశాఖ ఏసీ ప్రసన్నలక్ష్మి ఆదేశాలతో గోసలకుర్పల్లె సమీపంలో, బస్టాండు వద్ద ఉన్న అక్రమణలు ఎక్స్‌కవేటరుతో తొలగించారు. ఆలయ గ్రూప్ టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడి కన్నుమూత



ముత్యాలశెట్టి (ఫైల్‌ఫొటో)

కల్లూరు, ఆగస్టు 28: పులిచెర్ల మండలం కల్లూరు పట్టణానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ముత్యాలశెట్టి (94) బుధవారం కన్నుమూశారు. ఈయన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని గుర్తింపు పొందారు. మర్రికుంటవారిపల్లి (దేవళంపేట) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ రిటైరయ్యారు. ఈయన మృతి పట్ల పలువురు ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం), ఆగస్టు 28: కాణిపాక ఆలయంలో అన్నదాన పథకానికి నంద్యాలకు చెందిన గూడాలక్ష్మి, ఈశ్వరమ్మల పేరుతో వారి బంధువు బుధవారం రూ.1,00,116 విరాళంగా అందించారు. ఇన్‌చార్జి ఈవో వాణి వారికి స్వాగతం పలికి, స్వామి దర్శనం కల్పించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు.

మద్యం ధ్వంసం



పాలసముద్రం, ఆగస్టు 28: ఎన్నికల సమయంలో మండలంలో పట్టుబడిన 390లీటర్ల సారా, 1,460 బాటిళ్ల తమిళనాడు మద్యాన్ని బుధవారం కార్వేటినగరం ఎక్సైజ్ పోలీసుల సమక్షంలో ధ్వంసం చేసినట్లు ఎస్ఐ భారతి పేర్కొన్నారు. ఏఎస్ఐ మురుగేష్, కానిస్టేబుల్ రజిని పాల్గొన్నారు.

అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తికి చికిత్స



నగరి, ఆగస్టు 2: ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్ వద్ద అపస్మారకస్థితిలో పడి ఉన్న వ్యక్తికి రైల్వే పోలీసులు చికిత్స అందిస్తున్నారు. ఈనెల 26వ తేదీన ఆ వ్యక్తిని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో 108 వాహనం ద్వారా స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి మెరుగు పడకపోవడంతో తిరుపతి రుయాకు తరలించారు. వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే పుత్తూరు రైల్వే పోలీసులను 9963126434కు గాని 9440755983లలో సంప్రదించాలని కోరారు.

ఉపాధి పనుల్లో అక్రమాలపై నిర్లక్ష్యం

బైరెడ్డిపల్లె మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రెడ్డెప్ప

బైరెడ్డిపల్లె, ఆగస్టు 28 : మండలంలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనుల్లో అక్రమాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బుధవారం జరిగిన బైరెడ్డిపల్లె మండల సర్వసభ్యసమావేశంలో పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రెడ్డెప్ప అధ్యక్షతన సమావేశం జరిగింది. మండలంలో కొన్నిచోట్ల కొందరు కూలీలతో కాకుండా యంత్రాలతో ఉపాధి పనులు చేస్తూ బినామీ పేర్లతో బిల్లులు డ్రా చేసుకుంటున్నారని సభ్యులు ఆరోపించారు. అయినా అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుగా నోటీసులు ఇవ్వకుండా కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లను, వెలుగు సంఘమిత్రలను తొలగించడంపై అధికారులు సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. వెలుగులో అవకతవకలపై విచారించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీపీ రెడ్డెప్ప మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరు. 30గ్రామాల్లో మినీట్యాంకులు ఏర్పాటుచేయనున్నట్లు ఆయన చెప్పారు. జడ్పీ నిధులతో బోర్లు వేయనున్నట్లు తెలిపారు. జడ్పీటీసీ కేశవులు, ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, డీటీ కిశోర్, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు: డీఎస్పీ



పలమనేరు, ఆగస్టు28 : పలమనేరు డీఎస్పీగా డేగల ప్రభాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న విష్ణురఘురామ్ బదిలీ కావడంతో రాజమండ్రిలో ఎస్‌బీ డీఎస్పీగా పనిచేస్తున్న ప్రభాకర్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమిళనాడు, కర్ణాటక సరిహద్దులో అక్రమ రవాణా అరికట్టేందుకు, నేరాలు,చోరీల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకొంటామన్నారు. ముఖ్యమైన మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రం, ప్రధాన కూడళ్లు, పొలిమేరల్లో సీసీ కెమెరాలను ప్రర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసి వుంటే పరిశీలిస్తామన్నారు. నాణ్యమైన సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకొంటామన్నారు. నేరాల నియంత్రణకు సాంకేతికను వినయోగించుకొంటే సత్ఫలితాలు ఉంటాయాన్నారు. మద్యం, గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేస్తామన్నారు. పలమనేరులో ట్రాఫిక్ సమస్యలేకుండా చర్యలు తీసుకొంటామన్నారు.

ట్రిపుల్‌ఐటీకి ఎన్‌సీసీ విద్యార్థి ఎంపిక

బైరెడ్డిపల్లె, ఆగస్టు 28 : బైరెడ్డిపల్లె జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థి సంతోష్ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించడంతోపాటు ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉండటంతో సంతోష్ ట్రిపుల్‌ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం నసీబ్‌జాన్ బుధవారం తెలిపారు. విద్యార్థిని హెచ్ఎంతో పాటు ఎన్‌సీసీ ఏఎన్‌వో అధికారి యుగంధర్, ఉపాధ్యాయులు అభినందించారు.

కార్యకర్తల బలోపేతమే చంద్రబాబు సంకల్పం



చిట్టెపల్లెలో టీడీపీ జెండా ఆవిష్కరిస్తున్న మునిరత్నం

శాంతిపురం, ఆగస్టు 28 : కార్యకర్తలు బలపేతం కావాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పమని నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ పిఎస్ మునిరత్నం అన్నారు. చిట్టెపల్లెలో మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, జయపాల్‌తో కలిసి బుధవారం పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు గెలుపునకు కృషి చేసిన ప్రతి కార్యరక్తకు న్యాయం జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వ బాధితులకు అండగా ఉంటామన్నారు. అధికారం వచ్చిన నేపథ్యంలో గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తూ పార్టీని బలోపేతం చేయాలన్నారు. క్లస్టర్ ఇంచార్జీ విజయరామిరెడ్డి, యూనిట్ ఇంచార్జీ జయారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్రామాప్ప, మాజీ ఎంపీపీ వెంకటేష్, చెక్కునత్తం మణి, గిరిధర్, అనుసూయ, సుగునమ్మ తదితరులు పాల్గొన్నారు.

రిటైరైన ఉపాధ్యాయుడికి సన్మానం



గిరిధర్‌మూర్తి దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

బైరెడ్డిపల్లె, ఆగస్టు 28 : మండలంలోని చెలగానిపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ రిటైరైన గిరిధర్‌మూర్తిని బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవోలు వేణుగోపాల్‌రెడ్డి, సుబ్రమణ్యం ఘనంగా సన్మానించారు. ఆయన అందించిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయసంఘ నాయకులు ప్రకాష్, శశికుమార్, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగల గుర్తింపు సులభం



ఆటోడ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ మల్లేష్‌యాదవ్

శాంతిపురం, ఆగస్టు 28 : దొంగతనాలపైన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ సీఐ మల్లేష్‌యాదవ్, రాళ్ళబూదుగూరు ఎస్ఐ నరేషలు అన్నారు. బుధవారం శాంతిపురం పోలీస్ ఔట్‌పోస్టులో పలువురు వ్యాపారస్తులతో, ఆటోడ్రైవర్లతో వారు మాట్లాడారు. శాంతిపురం, కనమలదొడ్డి, రాళ్ళబూదుగూరు, తుమ్మిశి, కడపల్లె, గుణిశెట్టిపల్లెల్లో సీసీ కెమరాలను ఏర్పాటు చేయించారు. అనంతరం శాంతిపురం ఔట్‌పోస్టులో వారు విలేకర్లతో మాట్లాడారు. గ్రామాల్లో అనుమానితులెవరైనా తిరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు అమర్చుకుంటే దొంగలను సులువుగా గుర్తించవచ్చన్నారు. షాప్ యజమానులు వీటిని తప్పనిసరిగా అమర్చుకోవాలని సూచించారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ఆలయానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

తవణంపల్లె, ఆగస్టు 28: మండలంలోని మిట్టపల్లెలో వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు రాజన్ గ్రామస్తులతో కలిసి పూజలో పాల్గొన్నారు. టీడీపీ నేతలు దిలీప్, వెంకటేష్ చౌదరి, మణి నాయుడు, బాస్కర్‌నాయుడు, అమరేంద్రనాయుడు, గోపి, జయప్రకాష్, శరవణ, ధనంజయ, సతీష్, శ్రీధర్, కుమార్‌నాయుడు వారి వెంట ఉన్నారు.

తెలుగుభాష పరిరక్షణకు సమష్టి కృషి అవసరం



పద్యాల పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులతో సాంస్కృతిక సమితి ప్రతినిధులు

గంగవరం, ఆగస్టు 28 : తెలుగు భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కళామందిరంలో ముందస్తుగా తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలుగు మాధ్యమాన్ని పాఠశాల స్థాయిలో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తెలుగు మాధ్యమంలో చదువుకున్న వారికి మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత కలిగించేలా నిర్ణయం తీసుకోవాలన్నారు. తెలుగుభాషాభివృద్ధికి విశేషంగా కృషిచేస్తున్న పలువురికి జ్ఞాపికలు అందించారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, పద్యాల పోటీల్లో ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలసుందరం, సంస్థ కార్యదర్శి పుష్ప, మాధవరెడ్డి, ఆనందబాబు, వెంకటేశు, శ్రీపురం సీతారామయ్య, చంద్రశేఖరయ్య, హేమంత్, చైతన్య, తిమ్మప్పనాయక్ లతోపాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాల వేలం



వేలం పాట నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

వెదురుకుప్పం, ఆగస్టు 28: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను బుధవారం వేలం వేశామని కార్వేటినగరం ఎస్ఐ పి.రాజ్‌కుమార్ తెలిపారు. కార్వేటినగరం, వెదురుకుప్పం, ఎస్ఆర్‌పురం, పాలసముద్రం మండలాల్లోని పోలీసు స్టేషన్లలో, ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన నాలుగు వాహనాలను ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ, కార్వేటినగరం సీఐ హనుమంతప్ప సమక్షంలో వేలం వేయగా రూ.2,34,230 వచ్చిందని చెప్పారు.

చంద్రన్న వైద్యశిబిరంలో 560 మందికి సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, ఆగస్టు 28: చంద్రన్న ఉచిత కంటి శిబిరాన్ని సద్వినియోగం ప్రజలు చేసుకోవాలని మండల టీడీపీ అధ్యక్షుడు ఆనందరెడ్డి కోరారు. బుధవారం మండల పరిధిలోని విజలాపురం, వీర్నమల ప్రభుత్వ ఆసుపత్రుల ఆధ్వర్యంలో నిర్వహించిన చంద్రన్న ఉచిత కంటి శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కంటి సమస్యలు ఉన్న వారు శిబిరంలో పరీక్షలు చేసుకోవాలని కోరారు. శిబిరాల్లో 560 మందికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. 165 మందికి కంటి ఆపరేషన్లకు వైద్యులు ఎంపిక చేశారు. కార్యక్రమంలో మునస్వామి, నరహింహులు, పత్రానారాయణ, విశ్వనాథ్, వెంకటాచలం, వెంకటమణ, బాల రాజు, సుబ్రి, రాజారామ్, పాండియన్, శివాజీనాయక్, తాహసీల్దారు బాబు, ఎంపీడీవో ఈశ్వర్, వైద్యులు శశిధర్, పూజిత తదితరులు పాల్గొన్నారు.


పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

గంగాధరనెల్లూరు, ఆగస్టు 28: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎట్టేరి వెటర్నరీ డాక్టర్ నాగాంజనేయులు కోరారు. ఎట్టేరి వెటర్నరీ హాస్పిటల్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పశుబీమా చేసుకోవడం ద్వారా పాడి ఆవులు, గొర్రెలు, మేకలు మృతి చెందితే 15 రోజుల్లోపు ఇన్సూరెన్స్ మొత్తం వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారని తెలిపారు. మండలంలో 25,600గాను కేవలం 3,600 ఆవులకు మాత్రమే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామని, మిగిలిన రైతులు ముందుకు రావాలని కోరారు. టీకాలు వేస్తే పాల ఉత్పత్తి తగ్గుతుందన్న అపోహలు పక్కన పెట్టాలని సూచించారు.

ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గం

చిత్తూరు సిటీ, ఆగస్టు 28: ఏపీయూడబ్ల్యూజే జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో సీనియర్ పాత్రికేయులు ఆర్‌వో కృష్ణయ్య, ఏఆర్‌వో సుభాష్ బాబు, పరిశీలకులు మన్నెం చంద్రశేఖర్ నాయుడు, ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో కమిటీలోని పోస్టులకు పోటీ లేకపోవడంతో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎం.లోకనాథన్, ఉపాధ్యక్షుడిగా ఎస్.శివకుమార్, కోటేశ్వర యాదవ్, మురహరి రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మురళికృష్ణ, కార్యనిర్వహక కార్యదర్శిగా కేఎం. అశోక్ కుమార్, కోశాధికారిగా వాలప్ప, సహాయ కార్యదర్శులుగా ఇషార్ అహ్మద్, వెంకటాచలం, చంద్రమోహన్ ఎన్నికయ్యారు.

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కేంద్ర నిధులు: ఎంపీ దగ్గుమళ్ల



మాట్లాడుతున్న ఎంపీ ప్రసాదరావు

చిత్తూరు, ఆగస్టు 28: ఎస్సీ, ఎస్టీ వర్గాల ఆర్థికాభివృద్ధికి కేంద్రం నిధులు తీసుకొస్తానని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో ఏర్పాటు చేసిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ ఏ పథకాన్ని అమలు చేస్తే ఎస్సీ, ఎస్టీలు అభివృద్ధి చెందుతారనే విషయంపై పూర్తి సమాచారం ఇవ్వాలని కోరారు. కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ బిందు, తుంపర్ల సేద్య పరికరాలను రైతులకు సబ్సిడీపై అందిస్తామన్నారు. బిందు, తుంపర్ల సేద్యంపై ఎస్సీ, ఎస్టీలకు అవగాహన కల్పించాలని డీవీఎంసీ సభ్యులు, దళిత సంఘాల నేతలు కోరారు. పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల కోసం నియోజకవర్గంలో 350గోకులం షెడ్లను మంజూరు చేశామన్నారు. అనంతరం జిల్లాలో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను డీవీసీఎం సభ్యులు, నాయకులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఎస్పీ మణికంఠ, జేసీ విద్యాధరి, ఆర్డీవోలు చిన్నయ్య, మనోజ్‌కుమార్ రెడ్డి, శ్రీనివాసరాజు, వెంకటరామిరెడ్డి, డీవీఎంసీ సభ్యులు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

అన్నదానానికి రూ.లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం), ఆగస్టు 28: కాణిపాక ఆలయంలో అన్నదాన పథకానికి నంద్యాలకు చెందిన గూడాలక్ష్మి, ఈశ్వరమ్మల పేరుతో వారి బంధువు బుధవారం రూ.1,00,116 విరాళంగా అందించారు. ఇన్‌చార్జి ఈవో వాణి వారికి స్వాగతం పలికి, స్వామి దర్శనం కల్పించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు.

వెంకటేశ్వరాలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

తవణంపల్లె, ఆగస్టు 28: మండలంలోని మిట్టపల్లెలో వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు రాజన్ గ్రామస్తులతో కలిసి పూజలో పాల్గొన్నారు. టీడీపీ నేతలు దిలీప్, వెంకటేష్ చౌదరి, మణి నాయుడు, భాస్కర్‌నాయుడు, అమరేంద్రనాయుడు, గోపి, జయప్రకాష్, శరవణ, ధనంజయ, సతీష్, శ్రీధర్, కుమార్‌నాయుడు వారి వెంట ఉన్నారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం



పాలసముద్రం, ఆగస్టు 28: ఎన్నికల సమయంలో మండలంలో పట్టుబడిన 390లీటర్ల సారా, 1,460 బాటిళ్ల తమిళనాడు మద్యాన్ని బుధవారం కార్వేటినగరం ఎక్సైజ్ పోలీసుల సమక్షంలో ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ భారతి పేర్కొన్నారు. ఏఎస్‌ఐ మురుగేష్, కానిస్టేబుల్ రజిని పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి

పాలసముద్రం, ఆగస్టు 28: ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల సంఖ్యను పెంచాలని ఏపీవో మార్గరెట్ కోరారు. బుధవారం ఉపాధి హామీ కార్యాలయంలో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో ఆమె సమావేశమయ్యారు. ప్రస్తుతం రోజుకు 900 మంది కూలీలు పని చేస్తున్నారని, ఆ సంఖ్యను 2వేలకు పెంచాలని అన్నారు. పండ్ల తోటలకు నిధులు మంజూరైన రైతులు ఉపాధి కూలీలతో గుంతలు తవ్వించాలన్నారు. ఈసీ అనూష పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడికి మాతృవియోగం

విజయపురం, ఆగస్టు 28: జిల్లా పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్ తల్లి సక్కుబాయమ్మ(75) అనారోగ్యంతో బుధవారం విజయపురంలో మృతి చెందారు. పలువురు టీడీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. గురువారం ఉదయం 11 గంటలకు దహనక్రియలు ఉంటాయని కుటుంబీకులు తెలిపారు.

కేసీసీ లోన్లను రెన్యువల్ చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు మేనేజరు

విజయపురం, ఆగస్టు 28: కేసీసీ (కిసాన్ క్రెడిట్ కార్డ్) లోన్లను రెన్యువల్ చేసుకోవాలని పన్నూరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజరు రామాంజనేయులు కోరారు. మండలంలోని పన్నూరు బ్యాంకు ఆవరణలో బుధవారం ఆయన రైతులతో సమావేశమయ్యారు. సకాలంలో లోన్లు రెన్యువల్ చేసుకుంటే వడ్డీరేటు తగ్గుతుందని తెలిపారు. కొత్త లోన్లు మంజూరు చేస్తామన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



విజయపురం, ఆగస్టు 28: మండలంలోని కొత్త ఇళ్లత్తూరు ప్రాథమిక పాఠశాలలో బుధవారం రిటైర్డు హెచ్‌ఎం చంద్రయ్య విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఒకటి నుంచి ఐదు వరకు విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్, నోటు పుస్తకాలు అందించారు. హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు ప్రతిమ, ఎస్‌ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు

వెదురుకుప్పం, ఆగస్టు 28: కార్వేటినగరంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం నుంచి రెండు రోజులు పవిత్రోత్సవాలు జరుగుతాయని ఆలయాధికారి సురేష్‌కుమార్ బుధవారం తెలిపారు. గురువారం అంకురార్పణ సహా పూజాది కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. శుక్రవారం పవిత్రోత్సవం, పూజలు ఉంటాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వాహనాల వేలం

వెదురుకుప్పం, ఆగస్టు 28: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను బుధవారం వేలం వేశామని కార్వేటినగరం ఎస్‌ఐ పి.రాజ్‌కుమార్ తెలిపారు. కార్వేటినగరం, వెదురుకుప్పం, ఎస్‌ఆర్‌పురం, పాలసముద్రం మండలాల్లోని పోలీసు స్టేషన్లలో, ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన నాలుగు వాహనాలను ఎస్‌ఈబీ అడిషనల్ ఎస్పీ, కార్వేటి నగరం సీఐ హనుమంతప్ప సమక్షంలో వేలం వేయగా రూ.2,34,230 వచ్చిందని చెప్పారు.

నేడు తెలుగు భాషా దినోత్సవం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 28: గిరింపేట పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హరివిల్లు లలిత కళా వేదిక ఆధ్వర్యంలో గురువారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు హరివిల్లు కార్యదర్శి సి.మునస్వామి, గౌరవాధ్యక్షుడు వి.హరినాయుడు తెలిపారు. తెలుగు భాష ఉద్యమకర్త గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని, కళాకారులు, సాహితీవేత్తలు హాజరుకావాలని కోరారు.

సాయాన్ని సద్వినియోగం చేసుకోండి



గంగాధరనెల్లూరు, ఆగస్టు 28: ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులు దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు అమృత భారతి ఫౌండేషన్ ఛైర్మన్ ప్రకాష్‌రెడ్డి, శతావధాని ఆముదాల మురళి అన్నారు. తూగుండ్రం హైస్కూల్లో 9, 10 తరగతుల విద్యార్థులకు విద్యా సామగ్రి, స్వామి వివేకానంద జీవిత చరిత్ర పుస్తకాలను వారు పంపిణీ చేశారు. భారతీయ సంస్కృతి, విలువలను విద్యార్థి దశ నుంచే పెంపొందించుకోవాలని కోరారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం. రాజేంద్రనాయుడు, విద్యా కమిటీ ఛైర్మన్ కాణిపాకం సుధాకరశెట్టి, పూర్వ విద్యార్థి, చిత్తూరు వీఆర్వో ఆముదాల పద్మనాభం పాల్గొన్నారు.

పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

గంగాధరనెల్లూరు, ఆగస్టు 28: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎట్టేరి వెటర్నరీ డాక్టర్ నాగాంజనేయులు కోరారు. ఎట్టేరి వెటర్నరీ హాస్పిటల్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పశుబీమా చేసుకోవడం ద్వారా పాడి ఆవులు, గొర్రెలు, మేకలు మృతి చెందితే 15 రోజుల్లోపు ఇన్సూరెన్స్ మొత్తం వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారని తెలిపారు. మండలంలో 25,600గాను కేవలం 3,600 ఆవులకు మాత్రమే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామని, మిగిలిన రైతులు ముందుకు రావాలని కోరారు. టీకాలు వేస్తే పాల ఉత్పత్తి తగ్గుతుందన్న అపోహలు పక్కన పెట్టాలని సూచించారు.

అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తికి చికిత్స



నగరి, ఆగస్టు 28 : ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్ వద్ద అపస్మారకస్థితిలో పడి ఉన్న వ్యక్తికి రైల్వే పోలీసులు చికిత్స అందిస్తున్నారు. ఈనెల 26వ తేదీన ఆ వ్యక్తిని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో 108 వాహనం ద్వారా స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి మెరుగు పడకపోవడంతో తిరుపతి రుయాకు తరలించారు. వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే పుత్తూరు రైల్వే పోలీసులను 9963126434కు గాని 9440755983లలో సంప్రదించాలని కోరారు.

నేడు కుప్పంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 28: కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

పాఠశాలల్లో ఎయిడ్స్‌పై అవగాహన

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 28: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా పాఠశాలల్లో బుధవారం ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'మీకు తెలుసా? అంటూ విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. ఎయిడ్స్ నియంత్రణ, నివారణ ఇతర సలహాలు, సహాయం కోసం టోల్ ఫ్రీ నంబరు 1097 వినియోగించుకోవాలన్నారు. కోర్ ప్రాజెక్టు మేనేజర్ సద్దాం, కల్పన, ధనలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



గుడిపాల, ఆగస్టు 28: విద్యార్థులు ఇష్టపడి చదవాలని హెచ్‌ఎం కళావతి, అమృతభారతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రకాష్ రెడ్డి, నిర్వాహకులు మురళి అన్నారు. బుధవారం వారు విద్యార్థులకు స్వామి వివేకానంద జీవిత చరిత్ర పుస్తకంతో పాటు విద్యాసామగ్రి వితరణ చేశారు.

చంద్రబాబును కలసిన టీడీపీ నేత



వెదురుకుప్పం : తెలుగు యువత జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి బీగాల రమేష్ అమరావతిలో బుధవారం సీఎం చంద్రబాబును కలిశారు. కార్వేటినగరం మండలంలోని కృష్ణాపురం జలాశయం, ఇతర ఇరిగేషన్ అభివృద్ధి పనులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కేంద్ర నిధులు



సమావేశంలో మాట్లాడుతున్న చిత్తూరు ఎంపీ ప్రసాదరావు

చిత్తూరు, ఆగస్టు 28: ఎస్సీ, ఎస్టీ వర్గాల ఆర్థికాభివృద్ధికి కేంద్రం నిధులు తీసుకొస్తానని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో ఏర్పాటు చేసిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ ఏ పథకాన్ని అమలు చేస్తే ఎస్సీ, ఎస్టీలు అభివృద్ధి చెందుతారనే విషయంపై పూర్తి సమాచారం ఇవ్వాలని కోరారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ బిందు, తుంపర్ల సేద్య పరికరాలను రైతులకు సబ్సిడీపై అందిస్తామన్నారు. బిందు, తుంపర్ల సేద్యంపై ఎస్సీ, ఎస్టీలకు అవగాహన కల్పించాలని డీవీఎంసీ సభ్యులు, దళిత సంఘాల నేతలు కోరారు. పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల కోసం నియోజకవర్గంలో 350గోకులం షెడ్లను మంజూరు చేశామన్నారు. అనంతరం జిల్లాలో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను డీవీసీఎం సభ్యులు, నాయకులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఎస్పీ మణికంఠ, జేసీ విద్యాధరి, ఆర్డీవోలు చిన్నయ్య, మనోజ్‌కుమార్ రెడ్డి, శ్రీనివాసరాజు, వెంకటరామిరెడ్డి, డీవీఎంసీ సభ్యులు రాజ్‌కుమార్, దేవరాజులు, బాబు, డేవిడ్, ఎల్లప్ప పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలు అందించండి



వసతిగృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్ - గంగమ్మను దర్శించుకుంటూ..

నగరి, ఆగస్టు 28: దేశమ్మ ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించాలని ఆలయాధికారులకు ఎమ్మెల్యే భానుప్రకాష్ సూచించారు. కార్వేటినగరం మండలం డీఎంపురానికి చెందిన డీపీ దేశయ్య మందడి, జయలక్ష్మి దంపతుల ఆర్థిక సాయంతో ఆలయంలో నిర్మించిన నూతన వసతిగృహాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. వెంకటాచలం నాయుడు, గుణశేఖర్, ఉదయ్, బాబునాయుడు, దూర్వాసులు నాయుడు రాజశేఖర్, మణిరెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు. కాగా, మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేట, భీమానగర్‌లో బుధవారం జరిగిన గంగజాతరలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. కొత్తపేటలో స్థానికులతో కలిసి అమ్మవారికి సారె సమర్పించారు. భీమానగర్‌లో అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు రమేష్‌బాబు, గుణశేఖర్. మది, శ్రీనివాసన్ పాల్గొన్నారు.

ఈ మురుగుకు మోక్షమెప్పుడో?



గిరింపేట జంక్షన్‌లో రోడ్డుపై మురుగునీరు - డ్రైనేజీలు శుభ్రపరుస్తున్న దుర్గానగర్‌కాలనీ వాసులు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 28: నగరపాలక సంస్థ పరిధిలోని 16, 17, 18, 19 డివిజన్లలో రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తూ అటు పాదచారులను, ఇటు వాహనదారులను అవస్థలు పాలు చేస్తున్నాయి. వారాల తరబడి డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో చెత్తతో నిండిపోయి మురుగు నీరు రోడ్లపైకి వస్తున్నాయి. బుధవారం ఉదయం దుర్గానగర్ కాలనీలో స్థానికుడు ఒకరు బడి పిల్లలను వాహనంపై తీసుకెళుతూ జారిపడి ఆస్పత్రి పాలయ్యాడు. ఈ పరిస్థితి చూసి స్థానికులే మురుగు నీటి కాలువను స్వయంగా శుభ్రం చేశారు. గిరింపేట పరిధిలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గం



చిత్తూరు సిటీ, ఆగస్టు 28: ఏపీయూడబ్ల్యూజే చిత్తూరు జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. బుధవారం చిత్తూరు ప్రెస్ క్లబ్‌లో సీనియర్ పాత్రికేయులు ఆర్‌వో కృష్ణయ్య, ఏఆర్‌వో సుభాష్ బాబు, పరిశీలకులు మన్నెం చంద్రశేఖర్ నాయుడు, ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.లోకనాథన్, ఉపాధ్యక్షులుగా ఎస్.శివకుమార్, కోటేశ్వర యాదవ్, మురహరి రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మురళీకృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా కేఎం.అశోక్ కుమార్, కోశాధికారిగా వాలప్ప, సహాయ కార్యదర్శులుగా ఇషార్ అహ్మద్, వెంకటాచలం, చంద్రమోహన్, కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా గోవిందస్వామి, కె.రమేష్, జగన్నాథం, ఎల్‌ఎస్ ఖాన్, సురేష్, సుబ్రమణ్యం, సుధాకర్ నాయుడు, డి.ఉదయ్‌కుమార్, జయకర్, బి.జీవన్ కుమార్ రెడ్డి, సుబ్రమణ్యం, వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



బోరుకు పూజలు చేస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు రూరల్/చిత్తూరు, ఆగస్టు 28: మండలంలోని మాపాక్షి గ్రామ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారమైంది. గతవారం గ్రామంలో జరిగిన ఎద్దుల పరుగు పందెం పోటీల్లో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పాల్గొన్నారు. గ్రామంలో నీటి కొరత ఉందని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆయన వెంటనే బోరు మంజూరు చేశారు. మంగళవారం రాత్రి బోరు వేయడంతో పుష్కలంగా నీరు పడ్డాయి. సమస్య తీర్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, చిత్తూరు నగరంలోని 15వ డివిజన్‌లో కొత్త బోరు వేసి, అక్కడి తాగునీటి సమస్యను పరిష్కరించారు.

డ్రాపౌట్స్‌కు ఓపెన్ స్కూల్ వరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యాశాఖ అధికారులు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 28: డ్రాపౌట్స్‌కు ఓపెన్ స్కూల్ వరం లాంటిదని స్టేట్ కో-ఆర్డినేటర్ రవీంద్రనాయుడు, డీఈవో దేవరాజు అన్నారు. బుధవారం స్థానిక పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముందు ఓపెన్ స్కూల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వివిధ కారణాలతో బడిమానేసిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా చదువుకునే అవకాశం ఉందన్నారు. 14 నుంచి ఆపై వయస్సు వారు 10 టెన్త్, ఇంటర్ కోర్సులు చేసుకోవచ్చునని సూచించారు. ఎంఈవోలు సెల్వరాజ్, మోహన్, ఏఐ కోఆర్డినేటర్ తులసిబాబు, హెచ్‌ఎం పూర్వాణి, హేమాద్రి, లక్ష్మి, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

వర్షం వస్తే రాకపోకలు బంద్



గట్రాళ్లమిట్ట వద్ద ఉన్న వంక

గుడిపాల, ఆగస్టు 28: మండలంలోని గట్రాళ్లమిట్ట గ్రామ సమీపంలో బ్రిడ్జి లేకపోవడంతో గ్రామస్తులు పక్కనే ఉన్న వంక దాటాల్సి వస్తోంది. నిత్యం ఇందులో నీరు ప్రవహిస్తుండడంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. వర్షం వచ్చినప్పుడు ప్రవాహం ఎక్కువగా ఉండడంతో రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొంది. వంక దగ్గర కల్వర్టు నిర్మించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇకనైనా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైభవంగా శ్రీకృష్ణుడి ఊరేగింపు



బంగారుపాళ్యం, ఆగస్టు 28: మండలంలోని పాలేరు గ్రామంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి జ్ఞానవేదిక ఆధ్వర్యంలో బుధవారం శ్రీకృష్ణుడిని ఊరేగించారు. భక్తులు కోలాటాలు, నృత్యాలతో సందడి చేశారు. బంగారుపాళ్యం త్రైతసిద్ధాంత కమిటీ సభ్యులు మునిరత్నం, బాలాజి, ధనంజయ, లత, ధర్మేష్, చిట్టెమ్మ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

చిత్తూరు, ఆగస్టు 28: ఎస్టేట్‌లోని ఓ గోడౌన్‌లో పేకాట ఆడుతున్నారని ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం అందడంతో బుధవారం దాడి చేశారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.70 వేలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఒకటో పట్టణ సీఐ జయరామయ్య తెలిపారు.

మలుపుల్లో మొక్కలు తొలగించండి



గుడిపాల, ఆగస్టు 28: మండలంలోని మండికృష్ణాపురం మార్గంలో మలుపుల్లో మొక్కలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గుంతలమయమైన ఈ రహదారిలో మలుపుల వద్ద మొక్కలు ఏపుగా పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. మలుపుల వద్ద మొక్కలు తొలగించి, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. రోడ్డుపై గుంతలు పూడ్చాలని కోరుతున్నారు.

ముగిసిన కృష్ణజయంతి వేడుకలు

గుడిపాల, ఆగస్టు 28: మండలంలోని 197 రామాపురం గ్రామంలో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలు బుధవారం వసంతాలతో ముగిశాయి. శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని పుష్పపల్లకిలో ఊరేగించారు. మహిళలు కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

మద్యం బాటిళ్లు, సారా ధ్వంసం



వెదురుకుప్పం, ఆగస్టు 28: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన మద్యం బాటిళ్లు, సారాను బుధవారం కార్వేటినగరం బీసీ బాలుర హాస్టల్ పక్కనున్న చెరువులో ధ్వంసం చేసినట్లు కార్వేటినగరం ఎస్‌ఐ పి.రాజ్‌కుమార్ తెలిపారు. ఎస్‌ఈబీ అడిషనల్ ఎస్పీ, కార్వేటినగరం సీఐ హనుమంతప్ప సమక్షంలో ధ్వంసం చేశామని చెప్పారు.

సారా విక్రయిస్తే చర్యలు

వెదురుకుప్పం, ఆగస్టు 28: సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని వెదురుకుప్పం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య బుధవారం తెలిపారు. మండల పరిధిలోని కురివికుప్పం సమీపంలో సారా తయారీ స్థావరంపై దాడి జరిపి రెండు వందల లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశామని చెప్పారు.

సంతాన వేణుగోపాలుడి కల్యాణం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 28: చర్చివీధిలో వెలసిన రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా బుధవారం స్వామి అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు, అక్షింతలు, తలంబ్రాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 28: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం సద్గురు ఆశ్రమంలో మానస నారాయణి పూజలు నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు, నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. రాస్ వృద్ధాశ్రమం, డేనియల్ లెప్రసి సెంటర్లలో 70 మంది నిరాశ్రయులకు సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు వస్త్రాలు అందజేశారు. సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మధుసూదనం, శ్రీకంఠయ్య, పాండురంగం పాల్గొన్నారు.

ద్రౌపదీ అమ్మవారికి మండలాభిషేకం

వెదురుకుప్పం, ఆగస్టు 28: పచ్చికాపల్లం ద్రౌపదీ అమ్మవారి ఆలయంలో బుధవారం మండలాభిషేకం, పూజలు నిర్వహించారు. పెద్దపోటుచేను గ్రామస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించారు. సాయంత్రం పొంగళ్లు పెట్టి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

గ్రీవెన్స్‌పై అవగాహన కల్పించండి



వినతులు స్వీకరిస్తున్న డీఈ

చిత్తూరు రూరల్, ఆగస్టు 28: విద్యుత్తు శాఖ కార్యాలయంలో ప్రతి బుధవారమూ నిర్వహించే గ్రీవెన్స్ డేపై ప్రజలకు అవగాహన కల్పించాలని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర కోరారు. బుధవారం గాంధీ రోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ శాఖ గ్రీవెన్స్ డే నిర్వహించారు. 5 అర్జీలు రాగా ఒకటి అక్కడికక్కడే పరిష్కరించారు. ఈఈ మాట్లాడుతూ వినియోగదారులు, రైతులు తమ సమస్యలపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయవచ్చునన్నారు. 90 శాతం అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. డీఈ శేషాద్రి పాల్గొన్నారు.

ప్రజారోగ్యం పట్ల నిర్లక్ష్యం ఉండరాదు



సమావేశంలో మాట్లాడుతున్న చిత్తూరు ఎంపీ ప్రసాదరావు

యాదమరి, ఆగస్టు 28: ప్రజల ఆరోగ్యం పట్ల వైద్యులు నిర్లక్ష్యంగా ఉండకూడదని, 24 గంటలు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలందించాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కోరారు. మండలంలోని సంతగేటులో బుధవారం రూ. 1.46 కోట్లతో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీని ఎమ్మెల్యే మురళీమోహన్, కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ మారుతున్న జీవనశైలికి అనుగుణంగా వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని, రోడ్డు ప్రమాదాలు వంటివి జరిగినప్పుడు ఇక్కడే వైద్యం చేసుకోవాలని సూచించారు. పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని నమ్ముతూ యాదమరిలో పీహెచ్‌సీని ప్రారంభించి, అభివృద్ధికి తొలి అడుగు వేశామన్నారు. త్వరలోనే రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు చర్యలు చేపడతామన్నారు. పీహెచ్‌సీని ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు. గ్రోత్ హెల్త్ యూనిట్ల కోసం ప్రభుత్వం జిల్లాకు రూ.4కోట్లు కేటాయించిందని, ఈ నిధులతో సీటీ స్కాన్‌లు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ప్రభావతి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఉమామహేశ్వర్‌రెడ్డి, అదనపు డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, ఆర్డీవో చిన్నయ్య, తహసీల్దార్ పార్థసారథి, పార్టీ మండల కన్వీనర్ మురార్జీ, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ రబి, టీడీపీ నేతలు అమరనాథనాయుడు, గురుమూర్తి పాల్గొన్నారు.